# దాగిన మమత

శ్రీసీతారామయ్య కూరల సంచీ చేత్తో పుచ్చుకుని మెల్లిగా నడుస్తున్నాడు.

అర వైసంవత్సరాలు వయసు దాటింది. గతజీవితంలోని ఎన్నో సుఖ దుఖాఃల స్మృతులు అతని మెదడులో కదులుతున్నాయి. మొదటిభార్యతో కాపురంచేసే రోజుల్లో యిల్లా బజారుకు తాను ఎప్పుడూవెళ్ళలేదు, బంట్రోతులు యింట్లో కావలసిన సరుకు తెచ్చిపెట్టేవారు ఆమె పురమాయింపువల్ల. ఆమెకు ఆర్గురు సంతానం కలిగారు. వారిని సంరక్షించాలనే ఆశతో రెండో భార్యనుచేసుకున్నాడు సీతారామయ్య. అర వైఏళ్ళు దాటిన తనవంటి ముసలికి ఇర వైఅయిదేళ్ళ పడుచుభార్య ఎందుకని లోకం నిందిస్తోంది. కాని చేసిన తప్పు దిద్దుకోవడం కొన్నివిషయాలలో సాధ్యంకాదు. నిట్టూర్పు విడిచాడు సీతారామయ్య.

ఎదురుగా ప్రభుత్వం వారు కట్టించిన యిళ్ళ వరుస కనిపించింది.

ఏదో శ్రావ్యమైనకంఠస్వరం దూరంగా వినిపించింది. నడచినకొద్దీ ఆస్వరం దగ్గరగా మరీ మధురంగా వినిపించింది.

'శివదీక్షాపరు రాలనురా... !'

ఒకక్షణం అలాగే వీధిలో నిలబడి సీతారామయ్య ఆపాట తన్మయతతో విన్నాడు. వీధిలో నడిచే జనం అతన్ని చోద్యంగా చూశారు ఒక నిమిషం. స్థిమితపడి సీతారామయ్య బజారు వైపు నడక సాగించాడు మళ్ళీ.

కూరలు కొన్నాడు సీతారామయ్య. ఏరి, మంచివి, నవ నవలాడే తాజాసరుకులు...కాని ఆ అమ్మి ఆమె అంగడికి పోకుండా వుండలేడు సీతారామయ్య. మనస్సులో ఏదో స్వరూపాన్ని సృష్టించుకుంటాడు_ నవ్వుకుంటాడు. పులకరింపులు పొందుతాడు...మరుక్షణంలో తెలివితెచ్చుకుని, బజారులో తానున్నస్థితిని గమనించి, కదులుతాడు సీతారామయ్య. ఈరోజూ అలాగే.

రేడియోలోంచి పాట... వినిపిస్తోంది...ఏదో జానపదం_

సీతారామయ్య యింటి వైపు నడిచాడు...దారిలో మళ్ళీ అదే తన్మయత్వంలో నిలబడి పోయాడు సీతారామయ్య... గాత్రం... పాట సాగుతూనేవుంది మెల్లిగా, వెళ్ళి అయింటి అరుగుమీద కూర్చున్నాడు. ఎంతసేపు కూర్చున్నాడో సీతారామయ్యకే తెలియదు.

తలుపు చప్పుడయింది - మూసిన తలుపు తెరిచినట్లు... ఒకామె అన్నంతిన్న విస్తరి బయటికితెచ్చి విసిరేయడాన్కి వచ్చింది ఇంట్లో కిటికిలోంచి బయటికి వచ్చిన విద్యుద్దీపపు కాంతి, వీధిలో ఆకాశంనుంచి తొంగిచూస్తున్న కృష్ణపక్ష పంచమి చంద్రుని వెలుగు సీతారామయ్య ముఖంమీద ప్రతిఫలించాయి. సీతారామయ్య హఠాత్తుగా లేచి నిల్చున్నాడు.

'ఎవరు?' ఆమె ప్రశ్నించింది.

తల వంచుకొని ముందుకు నడిచిపోయాడు...పోతూ వెనక్కి తిరిగి చూశాడు.

లావుగాబొద్దుగా, దీపంనీడలో ఆమె మెరిసింది... అదేదో దివ్య మెరుపులా అనిపించింది. మళ్ళీ చూడాలనిపించింది ఆమెను తేరిపారి. కాని చీకటిసమయం... సీతారామయ్య కళ్ళెంవేసుకున్న మనసుతో బలవంతంగా గృహోన్ముఖుడైయాడు.

ఆమె నివ్వెరపోయింది ఒక నిమిషం.

"ఎవరో దారిబిచ్చగాడు... అనాధయాత్రికుడు... ఎవరో మరి!" అనుకుంది ఆమె _

ఒకరోజు సాయంత్రం కనుచీకటి పడింది. తనయింట్లో ఆమె కూర్చుని ఏదో పరధ్యానంగా ఆలోచిస్తోంది. వీధిగుమ్మం తెరిచేవుంది. ఇంట్లో విద్యుద్దీపం ఆర్పేసి కళ్ళుమూసుకుని ఆలోచనలోలీనమయింది ఆమె.

ఒక గొంతు సకిలించింది.

ఆమె ఉలిక్కిపడింది.

ఎదురుగా సీతారామయ్య తన చిన్నసంచితో !

నవ్వాడు _ మందహాసం.

'ఎవరు ? ఆమె గాభరాతో గద్దించింది.

'నా పేరు సీతారామయ్య !'

ఒకక్షణం నివ్వెరపోయినా, తిరిగి ఆమె ప్రశ్నించింది,

'ఏమన్నా పనుందా అండి... ?'

'మీతో ఒకసారి మాట్లాడిపోదామని వచ్చాను !'

ఆమెకు మరీ ఆశ్చర్యంకలిగింది. 'నాతోనా ?'

'అవును'

'కూర్చోండి' ఆమె ఎదురుగావున్న కుర్చీ చూపించింది.

సీతారామయ్య కూర్చున్నాడు,

'మీ పేరు ?' ప్రశ్నించాడు.

'భవాని'

సీతారామయ్య ఒక్క నిమిషం ఆనందంగా కళ్ళుమూసుకుని చిరు నవ్వు నవ్వుకున్నాడు.

కుర్చీ ఆమెకు ముందుగా దగ్గరగా లాక్కున్నాడు.

ముసలివాడు, బహుశా చెముడేమో అనుకుంది భవాని. అతను దగ్గ రగా రావడం ఏమీ పట్టించుకోలేదు.

మీ పాట విన్నాను ! చాలాహాయిగావుంది మీపాటలల్లా ఎల్లప్పుడు వింటూ వుండాలనే వుంటుంది.

'అది మీ సహృదయత. అభిమానం'

భవానికూడా నవ్వింది.

'ఈ ఇంట్లో ఎవరు వుంటారు ?'

ఇల్లంతా పరిశీలనగా చూశాడు సీతారామయ్య.

'మాబాబయ్య, పిన్ని వుంటారు. వాళ్ళయిప్పుడుసినిమాకివెళ్ళారు.

'అల్లాగా' మళ్ళీ నవుకున్నాడు సీతారామయ్య... ఇంకా దగ్గరికి' వచ్చాడు.

'ఒకటీ, రెండు పాటలు పాడుతావా నాకు వినాలని వుంది ?' సీతారామయ్య సరదాగా నవ్వాడు. ప్రతిమాలుతున్నట్లు ముఖం పెట్టాడు.

తన్నెరుగని ఎవరోమనిషి, తాను ఒంటరిగా వున్నప్పుడు ఇంట్లోకి ప్రవేశించి, దగ్గరగావస్తూ, తన్ను పాడమని లాలించడంలోని అంతరార్థం ఆమెకు బోధపడలేదు. అయినా అతని వయస్సు చూసి ఫరవా లేదనుకుంది భవాని. తన పాటను అభినందిస్తూ వీధిలోని జనంలో ఎవరో పెద్ద మనిషి యిలా రావడం యిదే మొదటిసారి. అందువల్ల ఒక ప్రత్యేకమైన అనుభూతి ఆమెను ఉత్తేజపరిచింది.

భవాని పాడింది.

కృష్ణశాస్త్రిగేయాలు, నండూరి, ఎంకిపాటలు ...

ఆమె కమ్మని కంఠమాధుర్యం సీతారామయ్యను మైకంతోనింపింది. ఆమెవైపే తదేకంగా చూస్తూ, ఏదో అపూర్వ ఆకాంక్షతో ఆమెను తన కళ్ళతో నమిలి మింగేస్తున్నంతగా గుటకలువేశాడు సీతారామయ్య.

భవాని పాట ఆపింది.

సీతారామయ్య ఆమెవైపే పిచ్చిగా సూటిగా చూస్తున్నాడు.

భవాని భయపడింది.

'అదేమటండీ ?' అరిచింది.

సీతారామయ్యకు తెలివివచ్చి కదిలాడు.

'ఎంతబాగా పాడావు... రాళ్ళు కరుగు తున్నాయి... ఎప్పుడూ నీదగ్గరే వుండిపోవాలని వుంది...చూడూ నేను ఒకకోరిక కోరనా?...ఏమీ అనుకోవుగదా ?'

భవాని అతని మనోభావం ఏమిటో అని కంగారు పడింది.

మౌనంగానే 'వూఁ' అంది.

చూడు...ఒకవారం రోజుల్లో గణపతి ఉత్సవాలు వస్తున్నాయి... ఒకరోజు నువ్వు సంగీత కచేరీ చేయాలి!'

సీతారామయ్య ఆతృతతో చూశాడు.

'నేనా ... కచేరీ చేయాలా' ? దిగ్భ్రమచెందింది భవాని... 'నేనెప్పుడూ కచేరీలు యివ్వలేదండీ... అయినా మాబాబయ్య ఒప్పుకోవాలి...

'మీ బాబయ్యగారు ఎప్పుడొస్తారు'

'రాత్రి పదిగంటలకు...

'పోనే వుండనా అప్పటివరకూ... వుండి... అయనతో మాట్లాడుతాను.

భవాని కాళ్ళు వణికాయి. ఈ ముసలాడి వుద్దేశ్యం ఏమిటో... రాత్రి పదిదాకా వుండి పోతా నంటాడు యింట్లో ... తాను ఒంటరిగా ఉంటుంటే...

'ఇప్పుడు...కాదండీ... ఎప్పుడైనా ప్రొద్దున్నరండి...ఆయనతో మాట్లాడవచ్చు...' నవ్వింది భవాని తొట్రుపాటు అణచుకుంటూ...

సీతారామయ్య మరోసారి యిల్లంతా పరికించాడు.

'నువ్వు ఒంటరిగా ఇంట్లోవుంటే భయంలేదూ ... నేనుసాయంగా వుండనా అన్నాడు?' సీతారామయ్య.

భవానికి ముచ్చెమటలు పోశాయి.

'సీతా ... సీతా... ప్రక్కింటి స్నేహితురాలిని వరండా లోంచి పిలిచింది భవాని...

'ఎందుకూ' అంటూ సీత వచ్చింది. 'ఆ... ఏంతోచక పిలిచాను!'

భవాని ముఖకవళికలు సర్దుకుంది.

సీతరాక సీతారామయ్య గమనించాడు

'సరేలే...ఎప్పుడైనా ప్రొద్దున్న వచ్చి మీబాబయ్యగారితో మాట్లాడుతాను... ఏంమధురంగా పాడుతావు...నీపాటవింటూంటే...నాఆనందానికి...అవధులులేవు' అంటూ సీతారామయ్య భవానికి యింకాదగ్గరగావచ్చాడు ... ఆమె భుజంమీద చెయ్యి వేశాడు...నవ్వాడు.

భవాని బలవంతంగా నవ్వింది. తనమీదఆయనచెయ్యివేసినాందుకు కోపంవచ్చినా, సీతముందు అల్లరిచెయ్యడం ఇష్టంలేక వూరుకుంది భవాని.

సీతారామయ్య సాలోచనగా నిష్క్రమించాడు.

సీతా, భవానికొ స్సేపు పిచ్చాపాటి మాట్లాడు కున్నాక. సీత కూడా తనయింటికివెళ్ళిపోయింది. బాబయ్య, పిన్ని, రాత్రియిటింకిరాగానే జరిగిన విషయం చెప్పింది.

'ముసలాడినిచూసి ఎందుకే యింతభయం... రేపు పడుచుమొగుడు వస్తే యింకా ఎంత భయపడుతావో!' పిన్ని వేళాకోళం ఆడింది... భవాని బుంగమూతితో కోపం అభినయించింది. బాబయ్య నవ్వాడు ఆదృశ్యం చూసి.

మర్నాడు పొద్దున్నే సీతారామయ్య భవాని యింటిముందు ప్రత్యక్షమయ్యాడు. భవాని బాబయ్య ఆయన్ను మర్యాదగా పలకరించి ఆసీనుణ్ణి చేశాడు సీతారామయ్య తనమనవి విన్నవించుకున్నాడు.

'అదెంత పనండీ ! భవాని కచేరి చేస్తుంది నేను చెబుతున్నాగా!' అన్నాడు భవాని బాబయ్య.

'మరి కరపత్రాల్లో పేరు వేసుకో మంటారా !' అడిగాడు సీతారామయ్య

'ఊ ! యింకా వెనుకాడ్డం ఎందుకండీ !'

సీతారామయ్య సంతోషించాడు.

కాఫీ త్రాగి నిష్క్రమించాడు.

భవాని మరీ సంతోషించింది...

యింకా అక్కడ కూర్చుని తన్ను వేధించనందుకు,

'ఇంత మంచివాణ్ణి అపార్థం చేసుకున్నావే' హేళన చేసింది పిన్ని

'అవును, అందరూ ఉంటే ఎందుకు మరోలా ఉంటాడు ఎవడైనా ?'

భవాని కోపం అభినయించింది.

'చాల్లేవే ! ముసలాయన... నీ తండ్రి లాంటివాడు' అంది పిన్ని.

ఒకరోజు మధ్యాహ్నం హఠాత్తుగా సీతారామయ్య ఎవరో ఒక ఆడపడుచును వెంటబెట్టుకువచ్చాడు

భవాని, పిన్ని యింట్లోనేవున్నారు. వారురాగానే ఆహ్వాన మందించింది పిన్ని.

'ఈమె నాభార్య, పద్మ'.

సీతారామయ్య పరిచయం చేశాడు. ఇరవైఏళ్ళ ఆస్త్రీనిచూసి భవాని, పిన్ని కొంచెం ఆశ్చర్యపోయారు.

'నాకు రెండోభార్య ' నవ్వాడు సీతారామయ్య.

భవానికి లోలోపల అనుమానం కలిగింది. ఎంత ముసలాడైనా పడుచువాళ్ళమీద దృష్టిపోలేదు. పండంటిపిల్ల జీవితంనాశనం చేశాడు పెళ్ళి చేసుకుని అని బాధపడింది.

ఏవో కబుర్లు పూర్తయ్యాక సీతారామయ్య, భార్య వెళ్ళిపోతూ— భవానిని, ఆమె పిన్నిని తమయింటి కోసారి రమ్మని ఆహ్వానించారు.

పిన్ని అంగీకరించింది.

ఒకరోజు పిన్ని బలవంతాన భవాని కూడా సీతారామయ్య యింటికి వెళ్ళింది.

సీతారామయ్య, ఆయన భార్య ఇద్దరికీ సుష్ఠుగా ఫలహారాలు పెట్టి, కాఫీ యిచ్చి, రవికెల గుడ్డలు చేతిలో పెట్టారు.

ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

'మరేం ఫరవాలేదండి...మిమ్మల్ని చూస్తే ఏమిచ్చినా ఫరవా లేదని పిస్తుంది' అన్నాడు సీతారామయ్య.

ఆమాటల్లో ద్వంద్వార్థం స్ఫురించింది భవానికి.

పిన్ని మామూలుగా తేలికగా తీసుకుంది.

'గణపతి చవితినాడు అమ్మాయి పూజ చేసుకుంటుందాండి' అడిగాడు సీతారామయ్య.

'చేసు కుంటుంది... గణపతిని చూడడానికి మా యింటికి రండి' ఆహ్వానించింది ఆ దంపతుల్ని పిన్ని.

ఇద్దరూ అంగీకరించారు.

అసలు సీతారామయ్య ఉద్దేశ్యమే అది.

'పొద్దున్నే పూజ సమయానికే వస్తాం ఇద్దరం' అన్నాడు సీతారామయ్య.

గణపతి చవితినాడు తలంటు పోసుకుని భవాని పూజా సన్నాహాలు ప్రారంభించింది.

సీతారామయ్య, పద్మ, భవాని యింటికి వచ్చారు,

'పండుగపూట యిదినాబహుమతి భవానికి' అన్నాడు సీతారామయ్య, భార్యచేత చీర యిప్పించాడు.

'ఇది ఎందుకండీ ! అంది పిన్ని మర్యాదగా

'ఫర్వాలేదమ్మా!' అంది పద్మ. ఆమె అలా అందికదా అని భవాని కూడా చీర తీసకుని ఊరుకుంది

సీతారామయ్య తనమీద చూపే అభిమానంలో ఏదో అంతరార్థం వుండివుందనే అనుమానం బలపడిపోతూంది భవాని మనస్సులో.

ఆ సాయంత్రం నాల్గుగంటలకే ఒకటాక్సీ తీసుకుని సీతారామయ్య భవాని యింటికి వచ్చాడు.

'అదేమిటండీ_ సంగీత కచ్చేరీ ఎనిమిది గంటలకయితే యిప్పుడే వచ్చారు?... పైగా టాక్సీ ఎందుకు... రెండు ఫర్లాంగులే కదూ గణపతి పందిర!... నేను మాపిన్నీ కలిసే వస్తాం... టాక్సీ పంపించేయండి ?" అంది కటువుగా భవాని.

'అదికాదమ్మ... అయిదు గంటల నుంచి పూజ జరుగుతుందిగా, వస్తేబాగుంటుందని' నసిగాడు సీతారామయ్య.

'మేము పూజకు రాం. కచేరికే తిన్నగా వస్తాం లెండి... టాక్సీ మీరు పంపించేయండి !'

భవాని కఠినత్వానికి సీతారామయ్య జాలిగా చూసి వెళ్ళిపోయాడు.

'ఎందుకే అలా అన్నావు...పోనీ టాక్సీలో వెడితే ఏంవచ్చింది !' అందిపిన్ని

'నీకుతెలియదులే...నేనుఒంటరిగా టాక్సీలోవస్తాననుకున్నాడు...' వయసురాగానేసరా?... బుద్ధులోఅంటించింది భవాని.

'సరేలే ... ఊరుకో ...! అనవసరంగా అనుమానించకు.' కేక వేసింది పిన్ని.

ఏడుగంటలుకాగానే సీతారామయ్య రెండురిక్షాలు తీసుకువచ్చాడు...

భవాని, పిన్ని రిక్షా ఎక్కారు. సీతారామయ్య మరో రిక్షా ఎక్కి, వాళ్ళతో గణపతి పందిర చేరాడు.

భవానిని పందిరలో కూర్చోపెట్టి, సీతారామయ్య ఆమె ప్రక్కకి చేరాడు.

'చూడమ్మా...నువ్వు పాడేపాటలు ఏమిటో నాకు తెలియదు కాని ...యివికూడా నీకువస్తే పాడమ్మా... అని ఒకకాగితం అందిచాడు సీతారామయ్య...భవాని ఆలిస్టు చూసింది అందులో ఆమె కొన్ని పాడగలదు.

'సరే' అంది భవాని.

'చూడమ్మా...నువ్వు ఎంత సేపు పాడదల్చుకున్నాపాడు... టైం పరిమితి అంటూ లేదు...నీ పాట వింటూంటే ఎంతో హాయిగా వుంటుంది నాకు' తన్మయత్వంతో కళ్ళు మూసుకున్నాడు సీతారామయ్య సకాలానికి సభలు ప్రారంభించడానికి మంత్రిపుంగవులు విచ్చేశారు.

భవాని కచ్చేరీ ప్రారంభమయింది...

ఆమె మాధుర్యం...ఆలాపన... గేయాలు... సెలయేటి నడకలా గలగలాసాగింది...ప్రేక్షకులు విస్తుపోయి ఆనందంతో వింటున్నారు... పదిగంటలుదాటింది. సీతారామయ్య వేదిక మీదకు వచ్చాడు.

భవాని పాట మాధుర్యానికి ఆమెనుఅభినందించి...ఈచీర, రవికల గుడ్డ...ఉత్సవ సంఘం పక్షాన సమర్పిస్తున్నానన్నాడు.

అందరూ హర్షధ్వానాలు చేశారు. 'చూడమ్మా! నీపాట ఆపమని మధ్యలో యీచీర యివ్వలేదమ్మా...నా వంట్లో బాగులేదు... గుండెలో ఏదో నొప్పి...నేనింటికి పోతున్నా.. ఇంట్లోవున్నా నీపాట వినిపిస్తుంది. నీమధురమైన గాత్రం వింటూ హాయిగా కన్ను మూయాలని ఉన్నదమ్మా' సీతారామయ్య నయనాలనుంచి రెండు కన్నీటిచుక్కలు రాలాయి.

పాడుతున్న భవాని హృదయం కలచి వేసినట్లయింది.

'ఏమిటి ఈయన యిలా అంటాడు...చనిపోతా నంటాడు' నివ్వెర పోయింది భవాని...

సీతారామయ్య మెల్లగా పందిరి విడిచిపోయాడు. భార్య పద్మకూడా ఆయన్ను అనుసరించింది.

భవానికి యింక పాడాలనిపించలేదు. కాని ఎదురుగా కూర్చున్న మంత్రిపుంగవులు ఆమె పాటమాధుర్యం ఆనందమైకంలో యింకా ఆమెను పాడమని కోరారు.

భవాని కాదనలేక మరో అరగంట పాడి ఆపింది. చివరకు మంగళ గీతం పాట మొదలెట్టింది. ప్రక్కనేవున్న సీతారామయ్య ఇంట్లోంచి ఏవో కేకలు వినిపించాయి.

సభ ముగిసింది. మంత్రిగారు భవానిని అభినందించి నిష్క్రమించారు. మృదంగం వైలిన్ వాయించేవారు తమమూటలు సర్దుకుంటున్నారు.

'సీతారామయ్యగారికి ఎలావుందో చూసిపోదామా?' అంది భవాని.

'ఓహో' యిప్పుడు నీకు అభిమానం వచ్చిందా...యీ రాత్రి!— పద యింటికి పద!' అంది పిన్ని కోపంతో.

తప్పనిసరిగా ఇంక మాట్లాడకుండా, భవాని, పిన్ని రాత్రి పద కొండుగంటలకు యింటికి చేరారు. మర్నాడు ప్రొద్దున్నే భవాని అరుగు మీద కూర్చుని పలుదోముకుంటోంది. పక్కింటి సీత తమయింటి ముంగిటలో నీళ్ళు చల్లుతూ వచ్చి భవానిని రాత్రి పాటకు అభినందించి "పాపం సీతారామయ్యగారు రాత్రి చనిపోయారట" అంది. భవాని తలలో ఏవో రైళ్లు పరిగెత్తినట్లు దిమ్మతో బాధపడింది...తక్షణం పిన్నికి బాబయ్యకు యీ కబురు చెప్పింది...పిన్ని భవాని కలిసి వెళ్ళి పద్మను కలుసుకుని ఊరడించారు...శవం దహనక్రియలకు లేవనెత్తుతున్నారు...

'ఎప్పుడూ మీ దృష్టే ఆయనకు...మిమ్మల్ని చూస్తే వాళ్ళ పెద్ద కూతురు జ్ఞాపకం వచ్చేదిట. అచ్చు మీ పోలికే...మీలాగే మంచిపాట... ఆయనకు మిమ్మల్ని చూసినప్పటినుంచి ఏవో పిచ్చి ఆలోచనలతో అల్లల్లాడి పోయేవారు...చనిపోయేటప్పుడు మిమ్మల్ని చూడాలన్నారు...కాని మీరు ఇంటికి వెళ్ళిపోయారు...అందుచేత కబురంపలేక పోయాను... ఆ అమ్మాయిని మన ఇంటికి అప్పుడప్పుడు పిలుస్తూ ఉండు' అన్నారు.

'సరిగా గణపతి చవితినాడే వారి పెద్ద కూతురు కూడా పోయిందిట' ఏడ్చింది పద్మ. పిన్ని గాఢమైన నిట్టూర్పు విడిచింది. భవాని కూడా కంట తడి పెట్టకుండా వుండలేకపోయింది...' ఇంక నేనెప్పుడూ పాటకచేరీ చేయను...నా పాట వింటే యిలా ఎవరైనా చచ్చిపోగలరు.'

బాధపడి పిన్ని ముందు మూల్గింది. భవాని ఇంటికి వచ్చాక గణపతి ఉత్సవాలు ఆపేశారు సీతారామయ్య మరణానికి సానుభూతితో...

భవాని కళ్ళముందు సీతారామయ్యే మెదిలాడు...ఆ మొదటి రోజు తనవంటిమీద చెయ్యివేసి శిరం నిమిరిన దృశ్యంలోంచి పితృవాత్సల్యం కళ్ళముందు తాండవించింది. చిన్నప్పుడే తండ్రిని పోగొట్టుకున్న భవానికి సీతారామయ్య రూపం కళ్ళముందు తండ్రిలా తాండవించింది. ఆనంద విషాద బాష్పాలు కారుస్తూ, భవాని ఒకక్షణం ఉక్కిరిబిక్కిరై పోయింది.

★